
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 22.817 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 22.817 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,779
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,952
నవర (8 గ్రాములు)	రూ.47,616

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /25.2

శనివారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆది వారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతా వరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

జొన్నవాడ ఆలయ చైర్మన్‌గా మావులూరు



నూతనంగా ఎంపికైన ఆలయ పాలకవర్గం

కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఇందుకూరుపేట మండలం రాముడుపాళేనికి చెందిన మావులూరు శ్రీనివాసులురెడ్డి శనివారం ఎంపికయ్యారు. పాలకమండలి సభ్యులుగా గాజుల సుజన, బట్టేపాటి విజయమ్మ, ఆములూరు విమల, ఇనమూరు త్రిశూల లక్ష్మి, ముంగర శివకుమార్, గుమ్మా రఘురామయ్య, కోటంరెడ్డి రాఘవరెడ్డి, సూరాయపాళెం రామకృష్ణతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వెంకట కామేశ్వరప్రసాద్ ఎంపికయ్యారు. వీరు 17న సాయంత్రం 5 గంటలకు జొన్నవాడ ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అంతర్జాతీయ యోగాలో అరుణకుమారి ఫస్ట్



బహుమతి అందుకుంటున్న అరుణకుమారి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఫత్తేఖాన్‌పేటకు చెందిన యోగా సాధకురాలు పి.అరుణకుమారి అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారు. శ్రీలంకలోని కొలంబోలో శనివారం ముగిసిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఏషియా అండ్ శివ, విష్ణు యోగా పీఠం నిర్వహించిన అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా అరుణకుమారికి పలువురు అభినందనలు తెలిపారు.

ప్యాకేజీ నగదు చెల్లిస్తాం

- సబ్ కలెక్టర్ హామీతో నిరసన విరమణ



నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న కర్లపాళెం గ్రామస్తులకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీని చెల్లిస్తామని సబ్ కలెక్టర్ విద్యాధరి శనివారం రాత్రి హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కర్లపాళెం గ్రామస్తులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నగదు మొత్తాన్ని ఒకేసారి చెల్లించడానికి ప్రభుత్వ, పోర్టు అధికారుల నుంచి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామస్తులందరూ తమ బ్యాంక్ అకౌంట్లను రెవెన్యూ అధికారులకు అందజేస్తే రెండు, మూడు రోజుల్లో వారి ఖాతాల్లోకి నగదును జమ చేస్తారని చెప్పారు. ఆమె వెంట పోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఐవీ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మయ్య ఉన్నారు.

వేకువనే మృత్యు ఘోష

మృత్యు శకటంగా దూసుకొచ్చిన లారీ

- ముందు వెళ్లే లారీని, ఆ తర్వాత ఎదురొచ్చే బస్సును ఢీకొన్న వైనం
- 25 మందికి గాయాలు
- నిద్రమత్తు, అతివేగమే ఘటనకు కారణం

7 మంది దుర్మరణం..

అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జామున జాతీయ రహదారిపై మృత్యుఘోష మిన్నంటింది. మృత్యుశకటమై దూసుకొచ్చిన ఓ లారీ ముందు వెళ్లే లారీని ఢీకొట్టి.. ఆ తర్వాత అవతలి మార్గంలోకి దూసుకెళ్లి ఓ ట్రావెల్స్ బస్సును ఎదురుగా బలంగా ఢీకొట్టింది. బస్సు ఒక్క కుదుపునకు గురైంది. గాఢనిద్రలో ఉన్న బస్సులోని ప్రయాణికులందరూ ఉలిక్కిపడి లేచేసరికి ఏమి జరిగిందో తెలియని పరిస్థితి. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం అదిరిపడింది. గుండెల్ని పిండే ఈ ఘోర దుర్ఘటనలో ఏడుగురి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోగా, మరో పాతిక మంది దాకా తీవ్రగాయాలకు గురై ప్రాణభయంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



కావలి వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ఐరన్ రీల్స్ లోడు లారీ

కావలి: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి.. ఓ వైపు ముసునూరు ఫ్లై ఓవర్ వంతెనపై వెలుగులు.. మరో వైపు టోల్‌ప్లాజా వద్ద లైట్ల వెలుగులు. ఈ మధ్య ప్రాంతంలో చిమ్మచీకటి. ఒక మార్గంలో ముందు వెళ్లే వాహనం.. మరో మార్గంలో ఎదురొచ్చే బస్సు అప్రమత్తంగానే ప్రయాణిస్తున్నాయి. ఇంతలోనే ఒక మార్గంలో వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న ఓ వాహనం ఏడుగురి పాలిట మృత్యు శకటంగా మారింది. రెప్పపాటులో పెను ప్రమాదం జరిగింది. మూడు వాహనాల డ్రైవర్లతోపాటు మరో నలుగురు ప్రయాణికులు నిద్రలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. ఈ విషాద ఘటన కావలి వద్ద ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో శనివారం వేకువజామున జరిగింది.

అంతా క్షణాల్లోనే..

చెన్నై నుంచి హైదరాబాదుకు ప్రయాణికులతో వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు కొన్ని క్షణాల ముందే టోల్‌ప్లాజా దాటి సజావుగా వెళ్తోంది. నెల్లూరు వైపు మార్గంలో గేదెలను తీసుకెళ్తున్న ఓ మినీలారీ కొన్ని క్షణాల్లో టోల్‌ప్లాజా వద్దకు రావాల్సి ఉంది. అంతలోనే ఈ లారీ వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన మరో లారీ (ఇనుపరీల్స్ లోడు) గేదెల లారీని ఢీకొని.. అదుపుకాక రోడ్డు మధ్యలో ఉండే డివైడర్‌ను దాటుకుని ఎదురొచ్చే బస్సుపైకి దూసుకెళ్లింది. ఒక పక్క గేదెల లారీ బోల్తా పడి అదే లారీ కింద పడి డ్రైవర్ దీపక్ (29) దుర్మరణం చెందితే.. దూసుకెళ్లిన లారీ బస్సును ఢీకొనడంతో ఆ లారీ క్లీనర్ సాంటి వేణు (22) వాహనంలోనే నలిగి ప్రాణాలు విడిచాడు. బస్సు క్యాబిన్‌ను లారీ బలంగా ఢీకొనడంతో బస్సు డ్రైవర్ మునుస్వామి తంబిరామ్(35) సైతం తన సీట్లోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద తీవ్రతకు బస్సులోని కప్పాడి తంబిస్వామి(27), అట్టల్ రూప(39), అంజూరి సురేష్(33) తీవ్రంగా గాయపడడంతో నెల్లూరు పెద్దాస్పత్రికి తరలించగా మృత్యువాత పడ్డారు. మరో గుర్తుతెలియని ప్రయాణికుడు (40) కావలి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో 25 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

నిమిషాల్లోనే అప్రమత్తమై..

ప్రమాదంతో జాతీయ రహదారిపై రెండు మార్గాల్లో వాహనాలు పడిపోవడంతో ఇరువైపులా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ప్రమాదం జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే ఉన్న టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వర్తిస్తున్న కావలి రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 108 వాహనాలు, హైవే అంబులెన్స్‌లను రప్పించి క్షతగాత్రులను హుటాహుటిన నెల్లూరు, కావలి ఆస్పత్రులకు తరలించారు. గేదెల లారీ డ్రైవర్ తన వాహనం కిందే పడి చనిపోవడంతో క్రేన్ సాయంతో వాహనాన్ని లేవనెత్తి అతని మృతదేహాన్ని వెలికితీశారు. ప్రమాదానికి కారణమైన ఇనుప రీల్స్ లారీ క్లీనర్ అదే వాహనం శకలాల్లో ఇరుక్కుపోవడంతో అతి కష్టం మీద వెల్డింగ్ కట్టర్లు, క్రేన్‌ల సాయంతో శకలాలను తొలగించి అతని మృతదేహాన్ని బయటకు తీశారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ కూడా సీటుకు, స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. అతని మృతదేహాన్ని అతికష్టంగా బయటకు తీశారు. ఇరువైపులా రోడ్లపై అడ్డంగా పడి ఉన్న వాహనాలను క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.




చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా మృతిచెందిన అట్టల్ రూప, అంజూరి సురేష్



లారీలో ఇరుక్కుపోయిన క్లీనర్ వేణు మృతదేహం



గేదెల లారీ డ్రైవర్ దీపక్ మృతదేహం

వివిధ ఆస్పత్రులకు క్షతగాత్రుల తరలింపు

ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన వారిని 108, హైవే సిబ్బంది హుటాహుటిన నెల్లూరు, కావలి ఆస్పత్రులకు తరలించారు. రాజస్థాన్‌కు చెందిన బమర్ మనోజ్, చౌటుప్పల్ మండలం మల్కాపూర్‌కు చెందిన కాటుకూరి పవన్, చెన్నై పెరుంబూర్‌కు చెందిన మేఘనాథన్ చంద్రశేఖర్, వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన తొక్కా నితీష్, చెన్నైకు చెందిన గుణశీలన్ రాజ్‌కుమార్, మధ్యప్రదేశ్‌కు చెందిన ధనేశ్వర్ సింగ్, నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన సేపూరి రాము కావలి ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు.

- విజయవాడకు చెందిన సజ్జా లోకేష్, గూడవల్లి శ్వేత, కొమ్మరాజుల లక్ష్మి, చెన్నైకు చెందిన కన్నన్ శివశంకర్ పాండియన్, నిర్మల వీ మణి, సబ్బినేని కళ్యాణ్ కుమార్, వెలయస్వామి గణేష్‌బాబు, మహబూబ్‌నగర్‌కు చెందిన కమలమ్మ, మియాపూర్‌కు చెందిన తోట గోపీనాథ్, రాజస్థాన్‌కు చెందిన భూపేందర్ సింగ్, హైదరాబాదు నిజాంపేటకు చెందిన కేవీ రామ్మూర్తి, మహారాష్ట్రకు చెందిన రణదీప్‌పాటిల్ కావలిలోని శ్రీచైతన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.
- మహారాష్ట్రకు చెందిన డాక్టర్ మైథిలి కులకర్ణి, డాక్టర్ అక్షయ్ కులకర్ణి, పిడుగురాళ్లకు చెందిన అక్కిన సందీప్, అలపాటి వేణుగోపాల్ నెల్లూరు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.
- హైదరాబాదు మియాపూర్‌కు చెందిన రవికుమార్ నెల్లూరు అపోలో ఆస్పత్రిలో, హైదాబాదుకు చెందిన ఆదిత్యారెడ్డి కావలి ప్రవీణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన ఐరన్ రీల్స్ లారీ డ్రైవర్ బెల్లంకొండ సురేష్ నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో ఏడుగురి ప్రాణాలను బలి తీసుకున్న ప్రమాదానికి కారణమైన ఐరన్ రీల్స్ లారీని క్లీనర్ సాంటి వేణు (22) నడుపుతున్నట్లు సమాచారం. డ్రైవర్ నిర్లక్ష్యంగా అనుభవం లేని క్లీనర్‌కు లారీని అప్పగించగా, అతను అతివేగంగా నిద్రమత్తులో లారీని నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. లారీ, బస్సు ముందు భాగాలు నుజ్జునుజ్జు అయిపోయాయంటే ప్రమాద తీవ్రత ఏంటో తెలుస్తోంది.

క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం

కావలి సమీపంలో జరిగిన ఘోర ప్రమాదం విషయం తెలుసుకున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని, గాయాల తీవ్రతను బట్టి మెరుగైన వైద్యానికి సిఫార్సు చేయాలని సూచించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. క్షతగాత్రుల వివరాల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూంలో 9440796383 నంబరు అందుబాటులో ఉంచామని, ప్రమాదానికి కారణాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమవుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం బిరదవోలు, చెర్లోపల్లి గ్రామాల్లో రూ.51 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, సైడ్ డ్రెయిన్లను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిరదవోలులో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బిరదవోలు పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.30 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రైతులు అడగక ముందే బిరదవోలు పంచాయతీ పరిధిలో వరి పంట ఎండిపోకుండా నాలుగు రోజుల క్రితమే కండలేరు ఎడమ కాలువ నుంచి సాగునీరు విడుదల చేయించినట్లు తెలిపారు.

సోమిరెడ్డివి దిగజారుడు రాజకీయాలు

నిత్యం దిగుజారుడు రాజకీయాలు చేసే టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై పోటీ చేస్తున్నందుకు తాను ఎప్పుడూ బాధపడుతుంటానని మంత్రి అన్నారు. రైతులకు భూములు అందజేస్తే సోమిరెడ్డి బాధపడుతున్నాడని, తాను భూములు కాజేసినట్లు ఆరోపిస్తున్నాడని మండిపడ్డారు. కండలేరు ఎడమగట్టు కాలువ ఎత్తిపోతలకు సోమిరెడ్డి హయాంలో రెండు హెవీ మోటార్లను బిగించగా, వాటిలో ఒకటి అసెంబుల్డ్ కావడంతో వినియోగించే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పనుల్లో కూడా ముడుపులు తీసుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతులకు జవాబు చెప్పాలన్నారు. తన హయాంలో 9 కి.మీ. మేర ఎడమ కాలువకు లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ మహ్మద్ రఫి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథ రామయ్యగౌడ్, సర్పంచ్ బి.వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు కోసం చినబ్రహ్మయ్య, బి.దయాకర్‌రెడ్డి, బి.ఓబుల్‌రెడ్డి, ఎ.బుజ్జిరెడ్డి, పి.చిన్నబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- 128 పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 19,567 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నడుమ నాన్ జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు



ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు నాన్ జంబ్లింగ్ విధానంలో సీసీ కెమెరాల నడుమ నిర్వహించనున్నారు. జిల్లాలోని మొత్తం 128 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ ప్రాక్టికల్స్‌కు 19,567 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 2,822 మంది బైపీసీ, 16745 మంది ఎంపీసీ విద్యార్థులు ఉన్నారు. ప్రాక్టికల్స్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు, ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో ఈ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించిన మార్కులను ఏ రోజుకారోజు ఎగ్జామినర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

పకడ్బందీగా పరీక్షలు

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు డీఈసీ కమిటీని ఏర్పాటు చేశారు. డీఈసీ కమిటీ కన్వీనర్‌గా ఆర్ఐఓ శ్రీనివాసులు, సభ్యులుగా దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య, వేణుగోపాల్‌రెడ్డి, డీవీఈఓ మధుబాబులను నియమించారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాక్టికల్స్ సజావుగా జరిగేలా 128 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 300 మందికి పైగా ఎగ్జామినర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నారు. విద్యార్థులు సమస్యలేమైనా ఉంటే కంట్రోల్ రూం నంబర్ 0861-2320312కు ఫిర్యాదు చేయవచ్చని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

> **అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసు**
>
> ప్రాక్టికల్స్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఆ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రలోభాలకు లొంగవద్దు. నేరుగా కేంద్రానికి వచ్చి పరీక్ష రాయాలి. సమస్యలపై కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీనివాసులు, ఆర్ఐఓ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉప ఖజానా కార్యాలయానికి శంకుస్థాపనను శనివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి వాటిని సమర్థంగా అమలు చేస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, పడుగుపాడు సహకార సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

క్లుప్తంగా

పొగమంచుతో రోడ్డు కనిపించక..

- లారీని ఢీకొన్న కారు
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



అద్దంకి: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన అద్దంకి – నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శింగరకొండ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జలదంకికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి (35) కారులో ఒక్కరే నెల్లూరు బయల్దేరారు. అద్దంకి మండలంలోని శింగరకొండ సమీపంలోకి రాగానే పొగమంచు కారణంగా రోడ్డు కనిపించక ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఘటనలో శ్రావణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కొండలు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అద్దంకి వైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని సౌత్ స్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. తెలుపు, బ్రౌన్ కలర్ చెక్స్ గల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఆకుపచ్చ రంగు, నలుపు గీతలు కలిగిన షార్ట్‌ను మృతుడు ధరించి ఉన్నారు. కుడి చేతిపై కల్పన అనే పచ్చబొట్టు ఉంది. మృతుడికి 30 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్సై హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ. 63
సన్నవి	రూ. 50
పండ్లు	రూ. 25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	143
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	252
బ్రాయిలర్ స్కిన్‌లెస్	280
లేయర్ చికెన్	145

రాజకీయంగా ప్రాధాన్యమిచ్చే వారికే మద్దతు



మాట్లాడుతున్న సుబ్బయ్య

- మాదిగల యుద్ధభేరి సభలో నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యమిచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలో మాదిగల యుద్ధభేరి మహాసభను సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత ఏబీఎం స్కూల్ నుంచి ప్రారంభమైన మహా ప్రదర్శన నర్తకి సెంటర్ వరకు సాగింది. అనంతరం నర్తకి సెంటర్‌లో మాదిగల యుద్ధభేరి మహాసభను సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం పలు మాదిగ ప్రజాసంఘాలు. ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న మాదిగల అభ్యున్నతికి కృషి చేసే పార్టీలకే తమ మద్దతు, అండదండలు ఉంటాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మాదిగలకు తగిన ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ చర్యలు చేపట్టడాన్ని అభినందించారు.

వర్గీకరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం నేతలు రవి రాఘవేంద్ర, కుడుముల సుబ్బారావు, విజయకుమార్, ఉద్యోగ సంఘ నేతలు వెంకటేశ్వర్లు, గడ్డం శేఖర్, మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు మందా పెంచలమ్మ, నేతలు కాకుమాని చెంచురామయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాగభైరవ సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నాగభైరవ సాహిత్య పురస్కారాలు – 2024 కోసం ముద్రిత గ్రంథాలను ఆహ్వానిస్తున్నామని నాగభైరవ సాహిత్య పీఠం ఒంగోలు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నానీలు, హైకూలు, రెక్కలు, రవ్వలు, కిరణాలు, మణిపూసలు వంటి లఘు కవితా ప్రక్రియ సంపుటాలను పంపవచ్చని చెప్పారు.

2020 నుంచి 2022 మధ్య ముద్రితమైన గ్రంథాలను మాత్రమే పంపాలన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన రచనలకు రూ.10 వేలు, రూ.ఐదు వేల ప్రోత్సాహక బహుమతులని ఈ ఏడాది ఆగస్ట్ 18న ఒంగోలులో నిర్వహించనున్న సభలో అందజేయనున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారు తమ రచనలను ఈ ఏడాది మార్చి 30లోపు పంపాలని కోరారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, రామయ్యనగర్, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ – 202, ఒంగోలు – 523002కు పంపాలని, వివరాలకు 98497 99711 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి సూచించారు. ఉదయగిరి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లోని మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సిబ్బందికి ఒక రోజు వర్క్‌షాపును స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి వ్యక్తికీ మూడు మద్యం సీసాలను మాత్రమే విక్రయించాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు, ఎస్సై పీర్‌సాహెబ్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు శిక్షణ

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించనున్నారని కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో జేసీ, డీఆర్వో, కమిషనర్, కందుకూరు సబ్ కలెక్టర్, ఆత్మకూరు ఆర్డీఓకు ఈ నెల 12 నుండి 16 వరకు.. కావలి, నెల్లూరు ఆర్డీఓలు, టీజీపీ స్పెషల్ కలెక్టర్ తదితరులకు ఈ నెల 19 నుండి 23 వరకు శిక్షణను నిర్వహించనున్నారని వివరించారు.

నిమ్మ మార్కెట్‌కు సెలవు నేడు

పొదలకూరు : స్థానిక నిమ్మ మార్కెట్ యార్డుకు ఆదివారం సెలవును ప్రకటించామని పొదలకూరు యార్డు అసోసియేషన్ కార్యదర్శి అట్లా ప్రభాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. యార్డులో వ్యాపారులైన ఖాదర్‌బాషా, వెంకటేశ్వరరెడ్డి ఒక రోజు వ్యవధిలో మృతి చెందిన నేపథ్యంలో సంతాప సూచకంగా సెలవును ప్రకటించామని తెలిపారు. నిమ్మ రైతులు గమనించాలని సూచించారు.